

# దేవుడు

జే.బి.ఎస్.ఎన్. మూర్తి

''దేవుడిని చూద్దువుగాని జాతరకు రా'' అంటూ నా స్నేహితుడు నరసింహం ఫోనులో పిలిచాడు. నేనుండేది విశాఖపట్నంలో. వాడుండేది విజయనగరం జిల్లా కొత్తూరు అని ఒక గ్రామం. వాడు చెప్పిన జాతర భీష్మ ఏకాదశి రోజునే జరుగుతుంది. వాడి ఆహ్వానం కాదనలేక సూర్యోదయం ముందరే బయలుదేరాను. రెండున్నర గంటల తర్వాత హైవే మీద బస్సు దిగాను. అక్కడినుంచి మూడు కిలోమీటర్ల సన్నటి తారు రోడ్డు. ఉదయం తొమ్మిది గంటలయింది. ఆ దారంతా బస్సులు దిగుతున్న జనాలతో, ఆటోలు, నాటుబళ్ళు, మోటారు సైకిళ్లతో రద్దీగా ఉంది. అందరితోబాటు ఒకడిగా నడక ప్రారంభించాను. రోడ్డు చాలా మలుపులతో ఉంది. నాతోబాటు నడుస్తున్న వ్యక్తుల మాటలు నా చెవిన పడుతున్నాయి.

''ఈయేడు జాతరకు జెనం బాగా పెరిగిపోనారు'' ఒకామె అంది

''ఈ దేవుడి పవరు అలాటిది. మరి జెనాలు రారా?'' అన్నాడింకొకడు.

''ఈ దేవుడి పవరుకు నీకేమైనా సాచ్చీకం జరిగిందా?'' ఇంకో స్త్రీ పక్కనున్న వాడితో అంది.

''ఎందుకు జరగలేదు. కిందటేడు నా కొడుక్కి ఉజ్జోగం వచ్చీయాలని మొక్కా. ఎంతనే దొరికిపోనాది'' మరొకడు అన్నాడు.

అలా వాళ్ళ మాటలు వింటూ ఊరి దగ్గరకు వచ్చాను.

అంతా జనం. జనం మధ్యన ఊరెక్కడ ఇరుక్కుపోయిందో తెలియలేదు. వచ్చే వాహనాలన్నీ ఊరి ముందరే నిలిపివేస్తున్నారు. ఊరికి రెండో చివర కొంచెం ఎత్తు ప్రదేశంలో శివాలయ గోపురం, ధ్వజ స్తంభం పైభాగం కనిపిస్తున్నాయి. వచ్చిన జనాలంతా ఊరి మధ్యగుండా అటువైపు వెళ్తున్నారు. ఎవరినో అడిగితే శివాలయం పక్కన వేరే మందిరం ఒకటుందనీ, అందులో దేముడున్నాడనీ చెప్పారు.

ఇంతలో నా కళ్లకు ఎదురుగా ఒక గూడు బండి వచ్చి ఆగడం కనిపించింది. అందులోనుంచి అరవై ఏళ్లు దాటిన ఆసామి రోగగ్రస్తుడిలా ఉన్నాడు. దిగడానికి అవస్థపడుతున్నాడు. సన్నగా బక్కచిక్కిపోయి తల వేలాడేస్తూ ప్రాణం ఉన్న శవంలా వున్నాడు. బండి వెనకాల అతడు దిగడానికి చెక్క స్టూలు వేశారు. అతడితో ఉన్న వయసు మళ్లిన స్త్రీ అతడి భార్య అయి ఉండాలి. మరో ఇద్దరు వ్యక్తులు అతడు బంధువులయి వుండాలి. అతడు దిగడానికి సహాయపడుతున్నారు.

''ఎక్కడినుంచి వస్తున్నారు?''

ఏదో పల్లె పేరు చెప్పారు.

''ఇక్కడికి ఎంత దూరం?''

''దాదాపు ఇరవై కిలోమీటర్లు'' చెప్పారు.

''జాతరకోసం ఈయన్ని శ్రమపెట్టి ఇంతదూరం తీసుకువచ్చారా?''

''అవును. ఈ దేవుడు మంచిదేవుడు. దర్శనం చేసుకుంటే జబ్బు నయమవుతుందట'' అన్నారు. అతడ్ని నెమ్మదిగా నడిపించుకుంటూ ముందుకు వెళ్తూ జనాల్లో కలిసిపోయారు.

ఆ ఊరినిండా టీ కొట్లూ, బఠానీల దుకాణాలూ, తినుబండారాల దుకాణాలూ చాలా వెలిశాయి. అవన్నీ బేరసారాలతో హడావుడిగా ఉన్నాయి. అలా ముందుకు వెళ్లి మందిరం దగ్గరకు చేరాను. అక్కడ నీడనిచ్చే చెట్లు చాలా ఉన్నాయి. ఆ ప్రదేశమంతా పిల్లలు ఊదుతున్న ఈలలతో, పేలుతున్న బూరలతో జనాల బేరసారాలతో కోలాహలంగా ఉంది.

మావాడు ఆ ఊర్లో ఎక్కడ ఉన్నాడో నాకు తెలీదు. జాతరలో దేవుడి మందిరం దగ్గర కలుసుకుందామని ఫోనులో చెప్పాడు. వాడిని కాంటాక్టు చేద్దామంటే సెల్‌ఫోనుకు సిగ్నలు లేదు. మందిరం బయట మర్రిచెట్టు కింద నిలబడి పరిసరాలన్నీ గమనించసాగాను.

చాలాసేపయింది. విసుగ్గా ఉంది. ఎదురుగా కనిపించిన ఒక వ్యక్తిని మాటల్లోకి దించా. ''ఎవరీ దేవుడు! ఎందుకీ జాతర?'' అని అడిగాను. అతడు నన్నో వెర్రివాడిని చూసినట్లు జాలిగా చూశాడు.

''ఈ దేవుడు సెయ్యెత్తి దీవిస్తే సాలు మన కోరికలన్నీ తీరుతాయి. జబ్బులేమైనా ఉంటే నయమయిపోతాయి. సంమచ్చరంలో ఈ ఒక్కదినం మాత్తరమే దర్శనం ఇస్తాడు. అందుకే ఈ జనం'' అన్నాడు.

''నీకేమైనా ఈ దేవుడి గొప్పతనం అనుభవంలోకి వచ్చిందా?'' ఆ వ్యక్తిని అడిగాను.

అతడు చెప్పాడు - ''నాకు కిందటేడు టయిపార్టీ జొరం వచ్చింది. మూడ్రోాలు మందులోడినా తగ్గనేదు. ఈ దేవుడికి దండమెట్టుకున్నాను. ఎంటనే టపీమని తగ్గిపోయింది.''

''ఒకవేళ అది తగ్గిపోతున్న దశలో దర్శనం చేసుకున్నావేమో'' అడిగాను.

''అలాగెందుకవుతాది?'' అంటూ ఆ వ్యక్తి జనాల్లో కలిసిపోయాడు.

పళ్లు పుష్పాలు పట్టుకొని మందిరంలోకి జనాలు క్యూ కడుతున్నారు. మావాడు లేకుండా నేను వెళ్లదలచుకోలేదు. ఎప్పటికీ రాడు. కొంచెం దూరంగా ఎవరో మావాడిలాగే కనిపించాడు. రెండడుగులు ముందుకేశాను. అతడు ఇటు తిరిగాడు. మావాడు కాదు. అతడి మీద కోపం వచ్చింది. ''నువ్వెందుకు మా నరసింహానివి కావు?'' అని అడగాలనిపించింది. అడగలేదు. అలానే నిల్చున్నాను.

భుజం మీద చెయ్యి పడేసరికి గిరుక్కున వెనక్కి తిరిగి చూశాను. నరసింహం నవ్వుతూ కనిపించాడు.

''ఫలానా చోట ఉంటానని చెప్పొచ్చుగా. ఇంత పెద్ద జాతరలో నిన్ను ఎలా పట్టుకోవడం?'' అని కోపంగా అన్నాను.

''నువ్వు నన్నెందుకు పట్టుకోవడం. నేనే నిన్ను పట్టుకున్నానుగా'' అన్నాడు వాడు.

''చూడు వీళ్లందరూ మందిరంలోకి ఎంత ఆదుర్దాగా వెళ్తున్నారో. ఆ దేవుడిని తొందరగా నాకు కూడా చూపించు'' అన్నాను.

అలాగే అంటూ ఎదురుగా వున్న పూల దుకాణం దగ్గరికి వెళ్లాడు. చేతిలో కొన్ని పుష్పాలు, అరడజను అరటిపళ్లతో తిరిగి వచ్చాడు.


వాటిని చూసి ''ఇవెందుకూ?'' అన్నాను.


''దేవుడి దగ్గరికి వట్టి చేతులతో వెళ్లకూడదు. సాంప్రదాయం పాటించాలి'' అన్నాడు.

క్యూలో నిలబడ్డాము. ముందున్న వాళ్లు దండం పెట్టుకుంటూ ముందుకు కదులుతున్నారు. మందిర ప్రవేశద్వారం దాటి లోపలికి వచ్చేసరికి రెండో కొసన గోడ ముందు కుర్ర కుర్చీలో ఆసీనుడై వున్న దేవుడు కనపడసాగాడు.

ఆ దేవుడు సుమారు నలభై అయిదేళ్ల వ్యక్తి. పెరిగిన గడ్డం, మెడని సగంవరకు కప్పేసింది. తెల్లటి లుంగీ కట్టుకుని ఉన్నాడు. భుజం మీద ఎర్రటి తువ్వాలుంది. కుర్చీలో కాళ్లు ఒక పక్కకు మడత వేసుకొని పాదాలు రెండూ బయటకు కనిపించేలా కూర్చున్నాడు. అతడికి రెండుపక్కలా అగరొత్తుల కట్టలు వెలిగించబడి ఉన్నాయి.

క్యూలోని ముందున్న వ్యక్తులు కోరికలు చెబుతున్నారు. దేవుడు తలూపుతున్నాడు. కొందరు అతడి కాళ్లకు తల ఆన్చి భక్తిగా నమస్కరిస్తున్నారు. కొందరు తమ చంకలో ఉన్న పసిపిల్లల్ని అతడి పాదాల మీద ఉంచి మళ్లీ ఎత్తుకొంటున్నారు.






హారతి వెలిగించి అతడి చుట్టూ తిప్పేవారు కొందరు. దేవుడు అందరినీ చెయ్యెత్తి దీవిస్తూనే వున్నాడు. వారి కోరికలు వింటున్నట్టు తల అటూ ఇటూ ఊపుతూనే ఉన్నాడు. కొందరు భక్తులు పుష్పాలు అతడి పాదాల మీదికి జారవిడుస్తు న్నారు. నిర్వాహకులు జనాలు సమర్పిస్తున్న ఫలా లను అతడి పాదాలకు తాకించి తిరిగి ఇచ్చేస్తు న్నారు. క్యూ ముందుకు కదిలేచోట ఒక హుండీ వుంది. కానుకలు ఇవ్వదలచుకున్నవారు ఆ హుండీలో వేయవచ్చు.

మరికాస్త ముందుకు జరిగాక దేవుడి ఆకారం స్పష్టంగా కనిపించింది. అగరొత్తుల పొగలో అటూ ఇటూ ఇబ్బందిగా కదులుతున్నాడా దేవుడు. మధ్యలో హచ్ అంటూ తుమ్మడం, ముక్కునుంచీ కళ్లనుంచీ నీరు కారడం, చేతిలోని గుడ్డతో తుడుచు కోవడం కనిపించింది. ఒక్కోసారి దగ్గు తెరను ఆపు కునేందుకు ఇబ్బందిపడుతున్నాడు.

నా ముందు నిలబడ్డ వాళ్లలో ఒక స్త్రీ ఉంది. ఆమె చంకలో ఏడాది పిల్లవాడు ఉన్నాడు. ఆ పిల్ల వాడు చాలా నీరసంగా ఉన్నాడు. ఆమె ఆ బాలు డిని అతడి పాదాల మీద ఉంచింది. "దేవుడా రెండు దినాల నుంచి పెదగెడ్డలా పారేస్తున్నాడు. సూడు ఎలా బక్కసిక్కిపోయాడో. ఈ యిరేచనా లని తగ్గించు. వచ్చే ఏడాది నీ కాడకు మళ్లీ వస్తాను" అంది. దేవుడు తలూపాడు.

చెయ్యెత్తి అభయం ఇచ్చాడు.

నా ముందున్న మరో వ్యక్తి మొక్కుకుంటు న్నాడు. "నా కర్రావు తప్పిపోనాది. దాన్ని తిరిగి నా యింటికి సేర్చు" దేవుడు తలూపాడు.

క్యూలో మావంతు వచ్చింది. నరసింహం భక్తిగా నమస్కరించాడు. నేనూ అన్యమనస్కం గానే నమస్కరించాను.

వేరే ద్వారం గుండా బయటకు వచ్చాము. అక్కడే చెట్టుకింద కూర్చున్నాము.

"ఈ జాతర నిర్వహిస్తున్నదెవరు?" అడిగాను నరసింహాన్ని.

"అప్పలనాయుడని ఈ ఊరికి పెద్ద. మా చుట్టమే" జవాబిచ్చాడు.

"ఈ దేవుడు మామూలు మనిషిలానే ఉన్నాడు. అసలు ఇతడు ఎలా అవతరించాడో చెప్పు" అన్నాను.

నరసింహ చెప్పాడు – "అయిదారేళ్ల కిందట ఒక గిరిజనుడు అప్పలనాయుడి పొలంలో పని చేసుకుందుకు కుదిరాడు. అతడు పగలు పని చేసు కొని రాత్రివేళ శివాలయంలో కూర్చుని కళ్లు మూసుకుని జపంలో ఉన్నట్టు ఉండిపోయేవాడు. కొన్నాళ్లకు అప్పలనాయుడు అతడిని ఇబ్బందిపె ట్టడం ఎందుకని పని చెప్పడం మానేశాడు. శివాల యంలో కళ్లు మూసుకుని అలానే కూర్చుంటున్న అతడికి జనాలు భక్తితో దండం పెట్టేవారు. అతడికి రోజూ భోజనం అప్పలనాయుడే పంపించేవాడు. కొన్నాళ్లకు అతడిలో అతీతశక్తులున్నాయనీ, వారాల తరబడి నిద్రాహారాలు లేకుండా అలానే జపంలో ఉండిపోతాడంటూ ప్రచారం జరిగింది. అందరూ అతడిని దేవుడనే చెప్పుకోసాగారు. దాంతో అతడి దర్శనంకోసం వచ్చేవాళ్ల సంఖ్య ఇంకా పెరిగింది. అప్పలనాయుడు అతడికి ఆలయం ప్రక్కనే వేరే మందిరం నిర్మించాడు. ఆ మందిరంలోనే అతడి బస. ఎవరూ లోపలికి వెళ్ల డానికి అనుమతించరు. ఒక్క భీష్మ ఏకాదశి నాడే సందర్శకులను అనుమతిస్తారు. ఆరోజు జాతర జరుగుతుంది.

"ఈ జాతర వల్ల ఎవరు లాభపడుతున్నారు?"

"నీకు చాలా సందేహాలున్నాయి. పద అప్పల నాయుడినే అడుగుదాం" అన్నాడు నరసింహం.

అప్పలనాయుడిది కొత్తగా కట్టిన స్లాబు ఇల్లు. టి ముందర కొబ్బరి ఆకులతో పందిరి వేసివుంది. ఆ పందిట్లో అతడి ఆజ్ఞలకోసం ఎదురుచూస్తూ కొందరున్నారు. గడపలో కూర్చుని అతడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాడు.

నరసింహం నన్ను పరిచయం చేశాడు. అతడికి ఎదురుగా వున్న కుర్చీల్లో కూర్చున్నాము. అప్పలనా యుడు నన్ను అడిగాడు – 'దర్శనం అయిపోయిందా?'

"అయింది కానీ ఆ దేవుడు ఒక సామాన్య వ్యక్తిలాగే వున్నాడు. అత డిని పట్టుకొని మీరు దేవుడిలా ప్రచారం చేయడం తప్పుకాదా?" అన్నాను.

అతడు నా ప్రశ్నకు మొదట నివ్వెర పోయాడు. తర్వాత "ఒక్కక్షణం ఆగండి" అంటూ ఇంట్లోకి వెళ్లాడు. మళ్లీ బయటకు వచ్చి "మనకు టీ చెయ్యమని చెప్పాను. ఇంట్లో గదిలో కూర్చుని మాట్లాడుకుందాం రండి" అంటూ లోపలికి పిలిచాడు.

నేను గదిలో అడుగుపెట్టి అక్క డున్న కుర్చీలో కూర్చోబోయాను. అక్కడ వినాయకుడి ఫోటో ఒకటి కాళ్ల దగ్గర కింద పడివుంది. దాన్ని తీసి చేత్తో తుడిచి అక్కడున్న టేబులుమీద పెట్టాను. నరసింహం నా పక్కనే ఇంకో కుర్చీలో కూర్చున్నాడు.

ఈలోగా మూడు కప్పులతో టీ వచ్చింది.

ముగ్గురం టీ తాగుతూ ఉండగా అప్పలనా యుడు అన్నాడు – "అతడు దేవుడు కాదంటారు. అంతేగా".

"అంతే" అన్నాను.

"అలా అంటే జనాలు ఒప్పుకొంటారా?"

నేను మాట్లాడలేదు.

"అతడు జపంలో వారాల తరబడి ఉండిపో వడం అంతా అబద్ధమని నాకు తెలుసు. అతడికి అతీత శక్తులున్నాయన్న ప్రచారాన్ని ప్రోత్సహిం చింది నేనే."

నేను నరసింహం వైపు చూశాను. ఇదంతా తనకు తెలుసునన్న ధోరణితో చూస్తున్నాడు.

"మీరు ఎందుకిలా అసత్యపు ప్రచారం చేస్తు న్నారు?" అడిగాన్నేను.

"అతడి పుణ్యమా అని మా వూర్లో జాతర జరు గుతోంది. అన్ని ఊర్ల జనాలూ మా ఊరికి వస్తు న్నారు. ఇలాంటి పెద్ద పండుగ మా ఊర్లో జరగడం మీకిష్టంలేదా?" అని జవాబిచ్చాడు.

"తప్పుడు నమ్మకాన్ని ప్రజల్లో ప్రచారం చేయడం తప్పుకాదా?" అన్నాను.

అప్పలనాయుడు సాలోచనగా చూస్తూ – "ఒక్క విషయం. ఇందాక మీ కాళ్ల దగ్గర వినాయ కుడి ఫోటో నేనే ఉంచాను. దాని మీద దుమ్ము తుడిచి మరీ భద్రంగా టేబులు మీద పెట్టారు. అది ఒక ఫోటో మాత్రమేనని మీకు తెలిసి కూడా దానికి ఆ గౌరవం ఇచ్చారు. అలాటి ప్రాణం లేని దేవుడి బొమ్మకు జనాలు దండాలు పెడుతున్నారు. మరి ప్రాణమున్న మనిషి చెయ్యెత్తి దీవిస్తున్నప్పుడు,

వరాలు ఇస్తానంటూ అభయమిస్తున్నప్పుడూ అతడిని దేవుడిగా కాక ఇంకెలా చూస్తారు? ప్రాణంలేని బొమ్మ మీద అయితే నిజం భక్తా? ప్రాణమున్న మనిషి మీద అయితే తప్పుడు విశ్వాసమా?'' అన్నాడు.

ఆలోచిస్తూ వుంటే అందులోని తర్కం బోధపడింది.

అప్పలనాయుడు ఇంకా చెబుతున్నాడు. ''ఈ దేశంలో ఎన్నో వేల కోవెళ్లున్నాయి. ఎన్నో దేవుళ్ల స్వరూపాలున్నాయి. జనాలకు ఈ దేవుళ్లు చాలడం లేదు. వీళ్లకు బ్రతుకంటే ఎప్పుడూ భయమే. వీళ్లు ఆరాధించడానికి ఇంకా కొత్త దేవుళ్లు కావాలి. అలాంటి దేవుళ్లలో ఈ దేవుడొకడు.''

''అంతా అర్థమయింది'' అన్నాను. మళ్లీ మరో సందేహం వచ్చింది.

''ఈ జాతరకు ఈరోజునే ఎంచుకోవడంలో ఆంతర్యం ఏమిటి?''

అప్పలనాయుడు చిరునవ్వుతో – ''మరి ఏదో ఒక పర్వదినం ఎంచుకోవాలి కదా?'' అని బదులిచ్చాడు.

అతడి వద్ద సెలవు తీసుకుని నరసింహంతో బాటు బయటకు వచ్చాను. మళ్లీ మందిర ప్రాంతంలోకి వచ్చి ఆగాము. అక్కడ ఇందాక ఎడ్ల బండి మీద దిగిన రోగి దేవుడి దర్శనం చేసుకుని బయటకు రావడం కనిపించింది. అతడు బాగా ఆయాసపడుతున్నాడు. ఆసరాగా తోడొచ్చిన మగ వ్యక్తులు పట్టుకొని నడిపిస్తున్నారు.

అతడి చేతిలోని అరటిపళ్లు చేతితోబాటు వణుకుతున్నాయి. అకస్మాత్తుగా అవి చేతిలోనుంచి జారి కిందపడ్డాయి. అది గమనించని ఆ వ్యక్తి వాటి మీద అడుగు వేశాడు. మరో రెండడుగులు వేయగానే అతడు కింద కూలబడ్డాడు. అతడిని పట్టుకున్న ఆ వ్యక్తులు భద్రంగా ఆ అరటిపళ్లను తీసి అతడి కళ్లకు అద్దారు. నోటిలోకి బలవంతంగా ఒక అరటిపండు ముక్కను కుక్కారు. ఒక ఆసామి మంచినీళ్లు పట్టాడు. అతడింక నడవలేడని అర్థమయింది.

''సాయం చేద్దాం రా'' అన్నాను నరసింహంతో.

మా ఇద్దరికీ సాయంగా మరికొన్ని చేతులు కలిశాయి. ఊర్లో జనాల గుంపుల మధ్యనుంచే ఊరి మొదట్లో ఉన్న ఎడ్లబండి దాకా మోసుకెళ్లాం. బండిలో పడుకోబెట్టాం. అప్పటికే అతడు ఆయాసంతో రొప్పుతున్నాడు. భార్య కంగారుగా అతడి గుండె మీద రాస్తూంది. ఆ వ్యక్తి కళ్లు ఎత్తి చుట్టూ చూశాడు. తర్వాత కళ్లు మూశాడు. ఊపిరి ఆగిపోయింది. ప్రాణం పోయింది. భార్య అతడి శరీరం మీద పడి రోదిస్తూంది.

విషయం అర్థమయిన జనాలు ఆ బండి చుట్టూ గుమిగూడారు.

''బీసమేకాసినాడు సచ్చిపోయాడు. ఎంత పున్నెం సేసుకున్నాడో'' అన్నాడొకడు.

''దేవుడి దరసనం అయిపోనాది. తిన్నగా సొరగానికే యెలతాడు'' అన్నాడింకొకడు.

ఆసలు దేవుడి ఆశీరాదం పొందాక వంటిలో ఉన్న జబ్బు పోవాలిగాని మనిసే పోనాడేమిటీ?'' మరొకడు అన్నాడు.

చుట్టూ చేరిన జనాలకు ఎన్నో సందేహాలు కలుగుతున్నాయి. సమాధానాలూ వాళ్లే చెప్పుకొంటున్నారు.

''సచ్చిపోయిన మడిసి దేవుడి దరశనం సేసుకొన్నాడా?''

''సేసుకొన్నాడు''

''మరి పెసాదం తిన్నాడా?''

ఒక ఆసామి చెప్పాడు – ''ఇతగాడు దేవుడి దరసనం అయాక పెసాదం తినలేదు. దాన్ని కాళ్లతో తొక్కేయడం నాను సూసాను''

''అదీ సంగతి. అపచారం జరిగిపోనాది. అందుకే సచ్చిపోనాడు'' మరొకడి గొంతు.

నరసింహం ఇదంతా చోద్యం చూస్తున్నట్టు నిలబడ్డాడు. ఏమీ మాట్లాడ్డం లేదు.

ఇంతలో చనిపోయిన వ్యక్తి భార్య అంది – ''ఏమిటో దేవుడు రోగం బాగు సేత్తాడనుకొని ఇంత దూరం తీసుకొచ్చాం. అక్కడ మందిరంలో అగరొత్తుల పొగకు తానే తట్టుకోలేకపోతున్నాడు దేవుడు. ఇక ఇలాటి వాళ్లనెలా రచ్చిస్తాడు?''

ఆమెవైపు అలానే చూస్తూ ఉండిపోయాను. చాలు, నిజం తెలుసుకున్నవాళ్లు ఒకరన్నా కనిపించారు.

★

